మనిషిలోని
మనిషిని ప్రేరేపించి
విజయాన్ని సాధించిన
అతను చేసిన తప్పు!

# డెడ్లీ మిస్టరీ

గంటి
రమాదేవి
కథ

జహీరాబాదునుంచి హైదరాబాదు పది నిమిషాల వ్యవధిలో వెళ్లవలసి వస్తుందని, ప్రొద్దున్న బ్యాంకుకి బయలుదేరినప్పుడు అనుకోలేదు.

కౌంటర్లో జనం బాగా వున్నారు. హెవీ విత్‌డ్రాయల్స్ — నెలాఖరు — జీతాలకోసం, ఖర్చులకోసం, ఇది విత్‌డ్రాయల్ సీజను. మాకు ముందే తెలుసు. అందుకే కేష్ రిజర్వు బాగానే పెట్టుకున్నాం బ్యాంకులో.

"సార్! మీకు హైదరాబాద్‌నుంచి ఫోను ..." అనగానే కొలీగ్ రమణని కూర్చోబెట్టి నేను ఫోను అటెండ్ చెయ్యడానికి వెళ్లాను.

"హలో... మీరేనా — మన అమర్‌నాథ్ లేడూ — క్రికెట్ ప్లేయర్ — సీనియర్ క్లర్క్... సమ్‌థింగ్ సీరియస్. మీకు ఫోన్ చెయ్యమని, వాళ్లమ్మగారు చెప్పారు..." మా బ్యాంకు యూనియన్ లీడర్‌నుంచి ఆ మాటలు వినగానే నీరుకారిపోయాను.

"అమర్‌నాథ్‌కి ఏమయింది? సమ్‌థింగ్ సీరియస్?... అమర్‌నాథ్ పనిచేస్తున్న కౌంటర్లో మోసం జరిగిందా? పెద్ద మొత్తంలో క్యాష్ గల్లంతయిందా?"

నా ఆలోచనలకు వెంటనే ఫుల్‌స్టాప్ పడింది. అమర్‌నాథ్ మా బ్యాంకు క్రికెట్ ప్లేయర్. ఫోర్‌డౌన్ బ్యాట్స్‌మేన్. స్పోర్ట్స్ మెన్ కౌంటర్లో కూర్చోరు. ఆఫీసులోను పనిచెయ్యరు. ఇక 'సమ్‌థింగ్ సీరియస్?' అంటే హెల్త్ సమస్యా — అమర్‌నాథ్‌కి ఆరోగ్య సమస్యలేం లేవు — ఏక్సిడెంట్...

అమర్, నేనూ బ్యాంకులో ఒకేసారి చేరాం. బ్యాంకులో చేరకముందు మేమిద్దరం జూనియర్ కాలేజ్‌లో స్నేహితులం. కాలేజ్




మొదలయినప్పటినుంచి ప్రతి క్లాసు తప్పక అటెండవుతూ, ప్రిపేరవుతే తప్ప పరీక్షలకు కూర్చునే ధైర్యం వుండేది కాదు నాకు.

"గురూ... ఈ బ్యాంక్ రీకన్సిలియేషన్ — ఓసారి చెప్పు... ఇన్‌కం అండ్ ఎక్స్‌పెండిచర్, సింగిల్ ఎంట్రీ ఎడ్జస్ట్‌మెంట్ గబగబా చెప్పు — అని పరీక్షలు రేపనగా వచ్చి కూర్చునేవాడు అమర్...

జూనియర్ కాలేజీ దాటి డిగ్రీ కాలేజీకి వచ్చినా, ఇదే ధోరణి. హైదరాబాద్‌లో బొల్లారంవైపు వుండేది అమర్ ఇల్లు. చదివి చదివి విసుగుపుట్టినప్పుడు లోకల్ రైల్లో వాళ్లింటికి వెళ్లేవాడిని.

వాడి గది ఇంటి చివరకు వుండేది... కిటికీ తెరిస్తే పచ్చటి చెట్లు, మొక్కలు, పొలాలు కనిపించేవి. వాళ్లింటికి వెడితే నాలుగైదు గంటలు గడిచిపోయేవి.

వాడి గదినిండా ప్రముఖ క్రికెటర్ల పోస్టర్లు కనిపించేవి. స్పోర్ట్స్‌స్టార్, స్పోర్ట్స్‌వరల్డ్ మధ్యలో కనిపించే పుల్ అవుట్స్... ఇండియన్ ప్లేయర్స్ — కపిల్, సచిన్, కాంబ్లి, ఇంగ్లాండ్ ప్లేయర్ హిక్... సౌత్ ఆఫ్రికన్ కిరిస్టన్... శ్రీలంక... అరవిందా, అర్జునా... పాకిస్తాన్ సయిద్ అన్వర్... వెస్టిండీస్ కోర్ట్నీవాల్ష్... అందరూ మంచి స్థాయి వున్న బేట్స్‌మెన్‌లే...

రెండు నెలల క్రితం దసరాకు వెళ్లినప్పుడు నాతో అన్నాడు. "ఈసారి నువ్వు వచ్చేసరికి బ్యాంకులో నా స్థాయి పెరుగుతుంది. ఫోర్‌డౌన్ ప్లేయర్ని, ఓపనర్‌గా వస్తా... ఇప్పుడు నా లక్ష్యం — డాన్ బ్రాడ్‌మేన్ — జహీర్ అబ్బాస్ కాదు — బ్రియాన్ లారా... టెస్టు క్రికెట్ అరుదైన ఈ రోజుల్లో లారా చేసిన 501 పరుగులు నిజంగా అద్భుతం..."

నాకు క్రికెట్‌లో ఓనమాలుకూడా రావు. ఆఫ్‌సైడ్ ఆన్‌సైడ్ డీప్ మిడ్ వికెట్ — ఈ టెర్మినాలజీ — గ్రీక్ అండ్ లాటినే నాకు.

బ్యాంకింగ్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి గ్రూప్ డిస్కషన్స్‌లో సెలక్ట్ అయి, ఇంటర్వ్యూ టెన్షన్స్ అనుభవించి, ఎవరెస్టు ఎక్కినంత కష్టపడి బ్యాంకులో గుమస్తా ఉద్యోగం సంపాదించిన నేను — అమర్ క్యాజువల్‌గా, "నిన్న మీ బ్యాంకువాళ్లు గ్రౌండుకి వచ్చారు. నన్ను ఎపాయింట్ చేస్తానంటే నేను "సీనియర్ క్లర్కు అయితేనే ఒప్పుకుంటాను — లేకపోతే లేదు" అనేసరికి "సరే" అని ఒప్పుకున్నారు" అని చెబుతూంటే ఆశ్చర్యపోయాను.

అమర్‌నాథ్ ఆఫీసులోకూడా కొలీగ్ అయ్యాడు. క్రికెట్ ప్రాక్టీస్ లేనప్పుడు బ్యాంకుకు వచ్చేవాడు.

సాయంత్రాలు, ఏ మెహఫిల్‌లోనో డ్రింక్స్ పుచ్చుకుని, డిన్నర్ చేసి ఇళ్లకెళ్లేవాళ్లం. ఒక్కోసారి ఇంగ్లీషు సినిమాలకు వెళ్లేవాళ్లం. ఆరోగ్యంగా, ఉల్లాసంగా వుండే అమర్‌కి "సమ్‌థింగ్ సీరియస్" అంటే అంతుబట్టడంలేదు... మనసుండబట్టడంలేదు.

మేనేజర్ని కలిసి, రెండురోజుల సెలవుకు అప్లై చేసి, రూముకు పరుగెత్తి, సంచిలో నాలుగు జతల బట్టలు, షేవింగ్ కిట్ పెట్టుకుని బస్టాండుకు పరుగెత్తాను — హైదరాబాద్ బస్సెక్కాను.

ఎంత ఆందోళనగా వున్నా, అమర్ విషయంలో అంత దారుణం జరుగుతుందని బస్సులో వున్నంతసేపు అనుకోలేదు... ఊహించలేదు.

హైదరాబాద్‌లో బస్సుదిగి ఆటో ఎక్కాను—

"కా జానా" అన్న ఆటోడ్రైవర్ రఫ్ వాయిస్ విన్న తర్వాతగాని నాకు ఆలోచన రాలేదు.

ఎక్కడికి వెళ్లాలి?

బ్యాంకుకా?... వాడింటికా?... ఆసుపత్రికా? — ఏ ఆసుపత్రి? అప్రయత్నంగా అన్నాను — "బ్యాంకు యూనియన్ ఆఫీస్ — కింగ్స్వే —"

○ ● ○

ఆ సమయంలో యూనియన్ ఆఫీసులో ఎవరూ వుండరు... కానీ ఈ రోజు ఎందుకో చాలామంది ఆఫీస్ బేరర్స్ వున్నారు. గట్టిగా మాట్లాడుతున్నశబ్దం బయటకు వినపడుతోంది. ఎంతో ముఖ్యమైన విషయం అయితేకాని అంతమంది రారు.

నేను ఆటో దిగి లోపలకువెళ్లాను. అందరూ ఒక్కసారి సైలెంట్ అయిపోయారు. యూనియన్ వైస్ప్రెసిడెంట్ సమ్మయ్యగారు నా దగ్గరగా వచ్చారు.

"బ్రదర్! సారీ! సంపత్గాడు అమర్నాథ్ని సంపిండు... ఆడ్ని పోలీసోళ్లు పట్కుపోయిన్రు... అరే గింత అన్యాలమా..."


సమ్మయ్య మాటలు నా చెవిలో పిడుగులా దూరాయి. "అమర్నాథ్ని సంపత్ చంపాడా?... అమర్నాథ్ ఏ ఆసుపత్రిలోనో ట్రీట్మెంట్ తీసుకుంటూ వుంటాడనీ, చూడొచ్చనీ అనుకుంటూ వచ్చాను.

నావళ్లు స్వాధీనం తప్పుతున్నట్లు అనిపించి ఆ నేలమీద కూలబడిపోయాను — షాక్... అనెక్స్పెక్టెడ్ షాక్... నమ్మలేకపోతున్నాను — సంపత్కూడా క్రికెటరే — అమర్ను ఎందుకు చంపుతాడు —

"ఇద్దరూ ఆడుతూండ్రుకదా — అమర్ మంచిగా కొడ్తుండు. అది గీవికి నచ్చకపాయె — రాత్రి ఇంటికి పోయి మరీ చంపిండు. అరే — బ్రదర్కి చక్కరొచ్చింది — డ్రింక్ తీసుకురారి..." సమ్మయ్య అరిచాడు.

సమ్మయ్యమాటలు నాకు కలలో మాటల్లా వినపడుతున్నాయి.

ఎవరో డ్రింక్ తెచ్చిచ్చారు. తేరుకున్నాను కొంతసేపటికి. ఆటోలోనే అమర్ ఇంటికి వెళ్లాము. ఇంట్లో ఎవరూ లేరు. అంతా ఆసుపత్రికి వెళ్లారు. అమర్కి



పోస్ట్‌మార్టమ్.

అక్కడ కట్టతెంచుకున్నసముద్రంలా దుఃఖం పొంగుకొచ్చింది.

''అమర్ — అమర్ — ఎంత పనయింది ? సంపత్ ఎంత పని చేశాడు''

దడదడా శబ్దం చేసుకుంటూ పోలీసు జీపు వచ్చి ఆగింది. ఇద్దరు కానిస్టేబుళ్లూ, ఒక ఇన్స్‌పెక్టరూ దిగారు. ఇన్స్‌పెక్టరు నా దగ్గరగా వచ్చి అన్నాడు.

''అమర్ మీకు బాగా తెలుసా?''

''చిన్ననాటి ఫ్రెండు'' అతికష్టంమీద జవాబు చెప్పాను. నా గొంతుస్వాధీనంలో లేదు. ''ఎవరు చంపారు?'' అడిగాను.

''అది ఇప్పుడే తెలియదు — అనుమానం మీద లెగ్‌స్పిన్నర్ సంపత్‌ని అరెస్టుచేశాం... ఇన్వెస్టిగేషన్ జరుగుతోంది...''

''నేనతన్ని చూడాలి...'' అన్నాను.

ఇన్స్‌పెక్టర్ మాట్లాడకుండా సంజ్ఞ చేశాడు. జీపు ఎక్కమని... పది నిమిషాల తర్వాత మేము పోలీస్ స్టేషన్లో వున్నాం. చిన్న పోలీస్ స్టేషన్. సంపత్ లాకప్‌గదిలో కింద కూర్చుని వున్నాడు — మోకాళ్లమీద తల ఆన్చి...

చప్పుడు విని తలెత్తి చూశాడు.

నేను దగ్గరగా వెళ్లాను. ''పాపాత్ముడా! ఎందుకురా అమర్‌ని చంపావ్...'' అన్నాను.

సంపత్ ఇనుప ఊచల దగ్గరగా వచ్చాడు. కొన్నినిమిషాల మౌనంతర్వాత అన్నాడు —

''అమర్ మీకెలా ఫ్రెండో నాకూ అంతే.

''క్రికెట్ ఆటలో అసూయ నాకు లేదు'' అన్నాను.

''నాకూ లేదు — నేను బౌలర్ని... స్పిన్నర్ని... లెగ్ స్పిన్నర్ని... అమర్ బ్యాట్స్‌మేన్ — నాకెందుకు అసూయ... అయినా స్పోర్ట్స్‌లో అసూయవల్ల ఒరిగేదేముంది — అమర్ని చంపితే నా క్రికెట్ ఆట బాగుపడుతుందా?...''

నిజమే సంపత్ ఆర్గ్యుమెంట్‌లో నిజముంది.

''ఆ రాత్రి నేను అమర్ని కలుసుకున్నమాట నిజమే — బ్రియాన్ లారా రికార్డు బద్దలు కొట్టాలని అమర్ వాంఛ — అబ్‌సెషన్!... ఎంతసేపూ అదే ఆలోచన... మీకు తెలియదనుకుంటా — ఇప్పుడు అమర్ విలకడగా ఆడుతున్నాడు. ఈ సీజన్లో ఏవరేజ్ రన్‌రేటు ఎనభై శాతం — ఒక్కో ఇన్నింగ్స్‌లో వంద రన్లు తక్కువ చేయలేదు''

''అందుకే చంపావా?'' కోపంగా అన్నాను.

సంపత్ విచారంగా నవ్వి అన్నాడు ''అమర్ ఎటువంటి పరిస్థితుల్లో కనిపించాడో మీకు తెలిస్తే ఈ మాట అనరు''

''చెప్పు...''

''అమర్ తల మొండెంనుంచి విడివడి, కిటికీ అవతల పదిహేను అడుగుల దూరంలో పడివుంది.... చాలా భయంకరమైన దృశ్యం... మొదటిసారి చూసిన నేను తెలివితప్పి పడిపోయాను. అలా చంపడానికి ఆయుధంగాని, ఆ బలంగాని నాకు లేవు — ఏదో మానవాతీత శక్తి...''

కొరడాతో కొట్టినట్టు ఉలిక్కిపడ్డాను.

''వాట్... అమర్ తల మొండెంనుంచి పదిహేనడుగుల దూరంలో పడివుందా?

అంటే — మనిషయితే అంతులేని కసి చేయిస్తుందా పని... మరి మానవతీత శక్తి..."

"నేనే ఈ పని చేశానని నమ్మి మన కొలీగ్స్ ఎవరూ నాకు జామీను ఇవ్వలేదు— ఎంత అసహ్యించుకుంటున్నారో — పోలీసులు అరెస్టు చేయగానే, బ్యాంకు సర్వీసు రూల్స్ ప్రకారం నన్ను సస్పెండ్ చేశారు"

ఇప్పుడు గుర్తుకొస్తోంది...

సబ్ ఇన్స్‌పెక్టర్ దగ్గరగా వెళ్లాను. "సంపత్ ఈ మర్డర్ చేసినట్టు మీరు నమ్ముతున్నారా?" అడిగాను.

"ఎవర్నో ఒకర్ని పట్టుకోవాలి... అమర్‌నాథ్‌ని ఆఖర్న చూసినవాడితనే"

"అంటే..."

"పర్సనల్‌గా నాకిదంతా అబ్సర్డ్ అనిపిస్తోంది. ఎవరైనా జామీనిస్తే వదిలేస్తాం"

"నేనివ్వవచ్చా?"

"లోకల్స్ ఇవ్వాలి..."

యూనియన్ వైస్‌ప్రెసిడెంట్ సమ్మయ్య జామీనిచ్చాడు.

"బ్రదర్! కౌన్సిల్ మెంబర్స్ ఒప్పుకోలేదు. నేనన్నా చూదుండ్రి... సంపత్‌గారికి మెడవరికి సంపేటంత కసెందుకుంటది... ఇది డెఫినెట్‌గా దయ్యం పనే"

పోలీస్ స్టేషన్‌కు వెళ్లేముందు సమ్మయ్య నాతో అన్నాడు.

○ ● ○

అమర్ శుక్రవారాలు మసీదుకు వెళ్లేవాడు. ఆదివారాలు చర్చికి. గురువారం సాయిబాబా గుడికి... శనివారాలైతే ఉపవాసాలుండేవాడు. నాకు ఇదంతా వింతగా వుండి అడిగాను. అతని సమాధానం —

"నేను పెద్ద క్రికెటర్ని కావాలి (అప్పటికింకా బ్రియన్ లారా రికార్డ్ బ్రేకింగ్ రన్స్ చేయలేదు) అందుకే ఏ పుట్టలో ఏ పాముందోనని... ఈసారి పార్శీలగుడికెళ్తాను"

"మరి జైనుల్నిమర్చిపోయావు" అన్నాను వేళాకోళంగా.


## ఉంగరం

ప్రేయసితో అన్నాడు గిరి.

"రాణీ మన ప్రేమకి గుర్తుగా మనం ఒకరి ఉంగరాలు మరొకరు మార్చుకుందామా"

"ఊరుకో... గతంలో ఇలా చేసినందుకే నా గోల్డు ఉంగరం పోయి గిల్టు ఉంగరం వచ్చింది"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



"మర్చిపోలేదు — ఎజెండాలో అదీ వుంది. శరవణ బెళగోడకి, ఈసారి మేచ్‌కి బెంగుళూరువెళ్లినప్పుడు వెడతా" అన్నాడు.

అలాంటిది ఒక్కసారి అన్నీమానేశాడు. ఎందుకని అడిగాను.

"ఇన్నాళ్లకి నాకు కావాల్సిన గురువు దొరికాడు. ఇటు ఆధ్యాత్మికతతోపాటు విజ్ఞానశాస్త్రపరంగా ఎంతో తెలిసినవాడు. రాజయోగ నేర్చుకుంటున్నాను. నువ్వు నమ్మవే మోగానీ మనలో మరో మనిషున్నాడు. యోగాతో ఆ మనిషిని మనకు కావాల్సిన విధంగా వాడుకోవచ్చు."

"అంటే నేను బ్యాంకుకు వెళ్లకుండా ఇంట్లో కూర్చుని ఆ మనిషిని పంపవచ్చా" నవ్వుతూ అన్నాను.

"ఆ మనిషిలో మనిషికి రూపం వుండదు. నీద్వారా నీచేతే అద్భుతాలు చేయిస్తాడు. మానవాతీతమైన ఫీట్లు చేసే వాళ్లంతా ఈ మరోమనిషివల్లే అలాచేయగలుగుతున్నారు"

"సరేరా! అమర్ బాబూ! ప్రొద్దున్నే కస్టమర్స్‌తో పడి పడీ వున్నాను. వళ్లు పులిసిపోయింది. వస్తా. తర్వాత వింటా నీ మరో మనిషి కథ..."

"ఆ మరో మనిషిని ఉపయోగించు — నీకీ అలసట వుండదు. నీకు తెలుసా — ఈసారి ఫీల్డులో వాడే వుంటాడు నాబదులు . ఇకచూడు పరుగులు...." నాకు హఠాత్తుగా భయం వేసింది. మనిషిలాంటి మనిషి. మనిషిలో మనిషి. మన చెప్పిన మాట వినక ఎదురు తిరిగితే..." నాకంతా అయోమయంగా వుండి, ఆలోచిస్తూ ఇంటికెళ్లిపోయాను . ఆ మర్నాడే నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ అందాయి — జహీరాబాద్‌కు.

○ ● ○

సాన్నిహిత్యాన్నిబట్టి ప్రేమ, ప్రేమనుబట్టి సుఖదుఃఖాల ప్రభావం వుంటుంది. లోకంలో కొడుక్కి తల్లి అంత సాన్నిహిత్యం ఎవరికీ వుండదు. తన శరీర ఖండమేకదా సంతానం.

అమర్ తల్లి దుఃఖం వర్ణనాతీతం... మిగిలినవాళ్లు తొందరగానేమర్చిపోయారు.

సెలవు పొడిగించి నేనువుండిపోయాను. ఈ మనిషిలో మనిషి అమర్ని చంపాడా? అంటే మన శరీరం మనకే హాని చేయడం అన్నమాట. ఎవరికంత అవసరం?

అమర్ గది తాళం తీసుకుని లోపలికి వచ్చాను.

ఈ మిస్టరీ క్లూ ఇక్కడే దొరకాలి.

కిటికీ తలుపు తెరిచాను... అడవిలా పిచ్చిగా పెరిగిన చెట్లు... తీగలు... తుప్పలు. .. టేబులువెతికాను. ఒక సొరుగులో దొరికాయి అమర్ డైరీలు. చదవడం ప్రారంభించాను.

◆ ఆదివారం: ఈరోజు యోగ క్లాసుకి వెళ్లాను... ఆత్మ, అంతరాత్మ, కాన్షన్స్, సబ్‌కాన్షన్స్ గురించి చెప్పారు శ్రీ రాజగురు ... మేమిద్దరమే ఆ రూములో. మైండ్ పవర్ ఉపయోగించి నా కలాన్ని ఆరంగుళాలు నేలమీదనుంచిలేపాడు.

◆ గురువారం: ఈరోజు లక్ష్మిని కలిశాను. పెద్దవాళ్లు పెళ్లిసంబంధాలు చూస్తున్నారు. తొందర పడకపోతే సమయం మించిపోతుందంది. క్రికెట్ ఓపెనర్‌గా రావాలి. మన దేశపు జట్టులో ఆడాలి. అంతవరకు పెళ్లి లేదన్నాను. ఏడుస్తూ వెళ్లిపోయింది. ప్రేమ తర్వాత... ముందు ఫేమ్...

◆ శనివారం: నా రూమ్ కిటికీలో ఏదో మాయ వుంది. అక్కడ్నుంచి చూస్తూ వుంటే ఏదో శక్తి లాగుతున్నట్టు వుంటుంది. రాజగురు అన్నారు. అది పాజిటివ్ సైన్‌ట. నేను 'సబ్‌కాన్షస్' స్వాధీనంచేసుకోగలనట.

◆ ఆదివారం: లీగ్ మేచెస్ జరుగుతున్నాయి. హైదరాబాద్ గ్రీన్ ఎలెవన్ జట్టులో ఆడుతూ వుండగా రాజగురు చెప్పినదాని ప్రకారం చేశాను. నా సబ్‌కాన్షస్ పనిచేసినట్టే అనిపించింది. తొంభై ఎనిమిది పరుగులు చేశాను. అలసటే లేదు. ఎంతో ఫ్రెష్‌గా ఫీలయ్యాను. లక్ష్మి వచ్చింది. పెళ్లాడకపోతే ఆత్మహత్య చేసుకుంటుందిట. ఈరోజు ఇంకో విచిత్రం జరిగింది. నా ఇన్నింగ్స్ ముగియగానే (నేను అవుటవలేదు. మా కెప్టెన్ డిక్లేర్ చేశాడు. ఆ రెండు పరుగులు ఇచ్చుంటే వాడి సొమ్మేం పోయిందో!) ఓ అమ్మాయి — మెరుపు తీగలా దూసుకువచ్చి నాకు షేక్‌హేండిచ్చింది.

◆ మంగళవారం: ఈ రాత్రి వింత సంఘటన జరిగింది. రూములో కరెంటు పోయింది. కిటికీ తలుపు తెరుద్దామని అనుకుంటుండగా, కిటికీ తలుపులు అవే తెరుచుకున్నాయి. బోల్టు ఎలా తెరుచుకుంది? ఈ టవర్ బోల్టులు తేలిగ్గా రావే!

రూములో ఎవరో తిరుగుతున్నారు — నాకు వెన్ను జలదరించింది. ఎవరు తెరిచారు కిటికీలు?

◆ ఆదివారం: రెండో లీగ్ మేచ్ — చాలా అద్భుతంగా ఆడాను. ఈసారి నూట యాభై ఆరు పరుగులు — మళ్లీ డిక్లేర్ చేశాడు. మా మొత్తం పరుగులు రెండువందల ఇరవై ఏడు — ఆ మెరుపు తీగ పరుగున వచ్చి నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంది. సున్నగా పట్టులా మెత్తగావుంది ఆమె చెయ్యి. హాయిగా వుంది.

◆ మంగళవారం: లక్ష్మి మళ్లీ వచ్చింది. ఏడ్చింది. ఆ అమ్మాయి ఎంత అందంగా వుంది. లక్ష్మంటే ఇదివరకు కొంచెం క్రేజ్ వుండేది. డెక్కన్ క్రానికల్‌లో నా ఫోటో

## తేడా



శత్రుఘ్న సిన్హా 'రాజకీయ నాయకుడి'గా చెలామణి అవుతున్నా — కొన్ని విషయాల్ని ఎంతో హుందాగా ఒప్పుకుంటాడు. ఈ మధ్యన ఎవరో ఆయనను బిక్షగాడికీ, రాజకీయనాయకుడికీ తేడా ఏమిటని అడిగారట! అప్పుడాయన బిక్షగాడు డబ్బుతీసుకుని మనను దీవిస్తాడు. రాజకీయ నాయకుడైతే... ఓట్లు తీసుకుని నోట్లు సంపాదిస్తూ మనకు నరకం చూపిస్తాడు అన్నాడట! నిజమేనంటారా!

— జూపిటర్

పడింది. ఎవరో స్పోర్ట్స్ రైటర్ నాగురించి రాశాడు. మెటీరియల్ ఫర్ ఇంటర్నేషనల్ క్రికెట్ అని. లక్ష్మి బోరున ఏడ్చినా నాకేమీ అనిపించలేదు. ప్రేమంటే ఏమిటి అని ఇప్పుడనుమానం వేస్తోంది. ఆ మెరుపుతీగ మళ్లీ కనపడితే — ఆమెకోసం మళ్లీ సెంచరీ చెయ్యాలి. నా 'పబ్ కాన్షస్'గాడు ఈ సారేం చేస్తాడో —

◆ శుక్రవారం: ఈ డొక్కు సైకిలు అమ్మేయాలి. చైన్ సాగిపోయింది. బాగుచేసుకోవాలి. షాపులో ఇస్తే మొత్తం ఓవరాయిలింగ్ అని రెండురోజులు చేస్తాడు. మోటారు సైకిలు కొనాలి. బుల్లెటంటే నాకిష్టం. ఆఫీసుకు ఫోన్ చేసి అడిగాడు కెప్టెన్ రంజీ మేచెస్ ఆడ్తావా? నీ పేరిస్తాను — డబ్బు బాగా ఇస్తారు — అని. నేను సరే అన్నాను. బుల్లెట్ మీద ఆఅమ్మాయినికూచోబెట్టుకుని.

◆ సోమవారం: ఈరోజు అద్భుతమైన రోజు. మా బేట్స్‌మన్లందరూ పెవిలియన్ దారి పట్టారు. నేను అవుటవలేదు. ఇక ఓడిపోయి నట్టే అనుకున్నారందరూ. ఆఖరి ఓవర్లో ఇరవైనాలుగు పరుగులు చెయ్యాలి. ఆరు బంతులు ఇరవైనాలుగు పరుగులు. రాజగురు నేర్పిన యోగ పనిచేసింది. నా మనిషిలో మనిషిని ప్రేరేపించాను. మొదటి బాల్ సిక్సర్. రెండోది నాలుగు. మూడోది బౌండరీ దాటకుండా ఆపేశాడు ఫీల్డర్. మూడు పరుగులిచ్చాడు. నాలుగో బంతికి రెండు పరుగులే. నా మనిషిలో మనిషిని తిట్టాను — ఏంటిది? అయిదో బంతికి ఆరు పరుగులు చేయించాడు. ఆరో బంతి బౌండరీ లైను దాటింది బుల్లెట్‌లా. మాస్టు వ్వ జనం ఒకటేచప్పట్లు. మెరుపుతీగ అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను ముద్దుపెట్టుకుంది. తన పేరు అపర్ణా బెనర్జీట. మర్నాడు క్రానికల్‌తోపాటు హిందూ, ఎక్స్‌ప్రెస్ గొప్పగా రాశాయి. 'ఇయాన్ బోథం'ఆఫ్ హైదరాబాద్ అని బిరుదిచ్చేశాడు ఒక స్పోర్ట్స్‌కాలమిస్టు.

◆ మంగళవారం: ఈరోజు అంత మంచిది కాదు. లక్ష్మి వచ్చింది. ఇన్నాళ్లూ నాకు ఆశలు కల్పించావు. ఇప్పుడు ఇదిగో అదిగో అంటున్నావు. నిన్ను నమ్ముకుని రాంచీలో పాలిటెక్నిక్ సీటొస్తే నీకు దూరమవుతానని వదులుకున్నాను. పేపర్లో చూశాను. ఎవరో అందగత్తె నీ బుగ్గన పెట్టిన ముద్దు — నన్ను ఏడిపిస్తున్నావు — నా ఉసురు పోసుకుంటున్నావు. నేను చచ్చి నిన్ను పీక్కుతింటూ — అని...

రాత్రి కలతగా నిద్రపట్టింది... దూరంగా ఏదో చప్పుడు... కిటికీ తలుపులు తెరిచి వున్నాయి. బయటకు చూశాను. భయంతో రక్తం గడ్డకట్టింది. ఆ చీకట్లో నా సైకిలెవరో బాగుచేస్తున్నారు. రూములో మూలన పెట్టిన నా బాట్ లేదు. భయపడి కిటికీ మూసేసి పడుకున్నాను. కలత నిద్రలో నా చెవిలో మాటలు "సైకిలు బాగయింది. సైకిలు బాగయింది. సైకిలు బాగయింది...."

◆ బుధవారం: భళ్లున తెల్లారింది. సైకిలు దగ్గరకు వెళ్లాను పరుగున. లూజుగా వున్న చెయిన్ సరిగా అయింది. నా రూములోకి వచ్చి చూశాను. బేట్‌కి సైకిలు గ్రీజు. ఎవరో దీన్నివాడారు. ఆరోజు సాయంత్రమే రాజగురుకి జరిగింది చెప్పాను. "నీ పబ్ కాన్షస్‌లో వున్న మరో మనిషిని మేల్కొల్పావు. అది నీకు సేవ చేస్తోంది" అన్నాడాయన. ఒక

అనుమానం వచ్చింది. "కోపం వస్తే కీడు చేస్తుందా?"

◆ సోమవారం: ఈ రోజు గ్రౌండ్‌లో వుండగా కబురొచ్చింది లక్ష్మి ఇంటినుంచి. వెళ్లలేదు. అపర్ణా బెనర్జీతో పరిచయం త్వరత్వరగా పెరిగింది.

ఆ సాయంత్రం తెలిసింది. లక్ష్మి ఆత్మ హత్యకి ప్రయత్నించిందిట. ఆసుపత్రిలో వుంది.

నాకు వెళ్లాలనిపించలేదు.

ఆ రాత్రి కృష్ణా ఓబిరాయ్ లో అపర్ణతో డిన్నర్!

◆ మంగళవారం: నిన్న రాత్రి చాలా భయంకరంగా గడిచింది. "లక్ష్మికి అన్యాయం చెయ్యకు. చెయ్యకు. చెయ్యకు. ఎవరో నా చెవిలో చెపుతున్నట్లు. నిన్ను చంపుతా. చంపుతా అని. నా ఛాతీమీద పెద్ద రాయి పెట్టినట్టు బరువుగా... మంచంతోపాటు గాలిలోకిలేపినట్టు. తెలతెలవారుతూండగా మెలకువ వచ్చింది. ఆశ్చర్యం. నేను గది బయట వున్నాను. తుప్పల్లో... ఎవరు చేశారీ పని — నా మనిషిలో మనిషా — "

◆ బుధవారం: నిన్న రాజగురు దగ్గరకు వెళ్లి చెప్పాను. నా అనుభవం... ఆయనేం మాట్లాడలేదు. నా మనిషిలో మనిషిని ఎలా కంట్రోల్ చెయ్యాలి? లక్ష్మి చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లాను.

ఇంత దారుణంగా వుంటుందని అనుకోలేదు. లక్ష్మి వళ్లు కాల్చుకుంది.

◆ గురువారం: మళ్లీ అదే అనుభవం. "లక్ష్మిని చేసుకో — చేసుకో — చేసుకో" నా చెవిలో జోరీగలా... ధైర్యంచేసి అన్నాను. "నో... నో... చేసుకోను. ఏం చేస్తావ్"

... ... ...

ఆ తర్వాత పేజీలన్నీ ఖాళీ — డైరీ మూసేశాను. ఎన్నో ప్రశ్నలు అమర్‌ని 'సబ్‌కాన్షస్' స్వాధీనపరచుకున్నాడా?

అమర్ మనిషిలో మనిషికి లక్ష్మి అంటే సానుభూతి వుండొచ్చు. అది అమర్‌మీద కసిగా మారి తనకి మూలమైన శరీరాన్ని నాశనం చేసిందా?

రాజగురుని కలిస్తే! డైరీనిబట్టి చూస్తే రాజగురుకి కూడా ఈ పరిణామం అంతుబట్టలేదుకదా!

ఆ సాయంత్రం రాజగురుని కలిశాను.

"ఎలా జరిగిందో తెలియదు. అమర్‌వాళ్ళ సబ్‌కాన్షస్‌ని ప్రేరేపించడంలో కృతకృత్యుడయ్యాడు. మరి అది అతన్నే ఎందుకు కబళించిందో విచిత్రం. ఆ మనిషిలో మనిషా... ఇంకా పరిశోధించాలి... అది ఇంకా వుండొచ్చు... పంచ భూతాల్లో కలిసిపోయుండొచ్చు."

నిరాశగా తిరిగొచ్చాను. లాభంలేదు. ఈ రాజగురుకు ఏమీ తెలియదు. ఇలా జరుగుతుందని ఊహించి వుండడు.

మర్నాడే బస్సెక్కాను జహీరాబాద్‌కు.

మనిషిలో మనిషి మిస్టరీ జీవితాంతం నన్ను వెంటాడుతూనే వుంటుంది! ఈ డెడ్లీ మిస్టరీ —

బరువెక్కిన హృదయం నాతోపాటే వస్తోంది హైదరాబాద్ వదిలిపెట్టి.

○ ● ○